సాక్షి
జనగామ

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



విద్యార్థుల మధ్య వివాదం..

కాకతీయ యూనివర్సిటీలో జీపీఈడీ, ఎంబీఏ విద్యార్థుల మధ్య వివాదం తలెత్తింది. ఇందుకు గల కారణాలు తెలుసుకునేందుకు కమిటీని నియమించారు. - 8లో▸



మహిళలు.. స్వశక్తులు

మహిళలు ఓ వైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే.. మరోవైపు తమకు ఆసక్తి ఉన్న టైలరింగ్‌పై మక్కువ చూపుతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31°/21°

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత మామూలుగా ఉంటుంది.

పత్తి రైతుల అరిగోస

- 26.5 ఎంఎం రకం పత్తి కొనుగోలు చేయని సీసీఐ
- వరుస వర్షాలు, వాతావరణ మార్పులతో తగ్గిన నాణ్యత
- ప్రైవేట్‌లో అడ్డగోలుగా ధర తగ్గిస్తున్న వ్యాపారులు
- క్వింటాకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 నష్టపోతున్న రైతన్నలు



పత్తిలో తేమ శాతం పరిశీలిస్తున్న సీసీఐ బాధ్యుడు

జనగామ: తెల్లబంగారం పండించిన రైతులు పంటను అమ్ముకోవడానికి అరిగోస పడుతున్నారు. ప్రైవేట్ వ్యాపారుల చేతిలో దగా పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ సెంటర్లను ఏర్పాటు చేశాయి. పింజ 8 నుంచి 12 శాతం క్వాలిటీతో ఉన్న పత్తిని క్వింటాకు రూ.7,521 ప్రారంభ ధరతో కొనుగోలు చేస్తున్న సీసీఐ.. అంతకు మించితే తీసుకోవడం లేదు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. అక్టోబర్ 18న జిల్లాలో సీసీఐ సెంటర్లను ప్రారంభించగా.. రోజువారీగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. 30, 29ఎంఎం (పొడవు గింజ) రకానికి చెందిన పత్తి కొనుగోళ్లు పూర్తి కాగా.. ప్రస్తుతం 28 ఎంఎం రకానికి చెందిన పత్తి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో 26, 26.5ఎంఎం రకానికి చెందిన పత్తి వస్తుండడంతో కొనుగోలు చేయడం లేదు. నిబంధనల మేరకు పత్తి లేకపోవడంతో తిరస్కరిస్తున్నారు. జిల్లాలో 15 కాటన్ మిల్లుల పరిధిలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇప్పటి వరకు 22,833 మంది రైతుల నుంచి 6,05,176 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు.

ప్రైవేట్‌లో అడ్డగోలు దోపిడీ

సీసీఐ తిరస్కరించిన పత్తిని రైతులు ప్రైవేట్ మార్కెట్‌కు తీసుకువెళ్తే అడ్డగోలుగా ధర తగ్గిస్తున్నారు. 26, 26.5ఎంఎం రకం పత్తి క్వింటాకు రూ.6వేల నుంచి రూ.6,200 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాకు రూ.1000 నుంచి రూ.1,200 నష్టపోవాల్సి వస్తున్నది. జిల్లాలో పత్తి దిగుబడి వచ్చే సమయంలో 20 రోజుల పాటు వాతావరణం చల్లబడి, నిరంతర ముసురు, జోరు వానలు కురిశాయి. దీంతో పత్తి నలుపు రంగుకు మారడంతోపాటు ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి తగ్గింది. ఈ సమస్య ఎక్కువగా లింగాల ఘణపురం, పాలకుర్తి, రఘునాథపల్లి, జఫర్‌గఢ్, నర్మెట, కొడకండ్ల తదితర ప్రాంతాల్లో ఉంది. నాణ్యత తక్కువగా ఉన్న పత్తిని సీసీఐ తిరస్కరించడంతో రైతులు అధికారులను నిలదీస్తున్నారు. నిబంధనలు పాటించడం తప్ప తాము ఏమీ చేయలేమని చెప్పి పంపిస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తుండడంతో ఇదే అదనుగా అడ్డగోలుగా ధర తగ్గిస్తున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి క్వాలిటీ పత్తి కొనుగోలు చేసేందుకు కేంద్రం అనుమతివ్వగా.. ఇక్కడ కూడా అమలు చేయాలని ఇటీవలే భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సంబంధిత కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రం అనుమతి ఇవ్వాలి..



సీసీఐ సెంటర్‌లో 26, 26.5 ఎంఎం రకానికి చెందిన పత్తి కొనుగోలు చేసేలా కేంద్రం ఆదేశించి రైతులను ఆదుకోవాలి. లేని పక్షంలో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. రైతుల కష్టాన్ని చూసి సానుకూల దృక్పథంతో స్పందించాలి.

\- రామ్మోహన్, కాటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ప్రైవేట్‌లో రూ.6వేలు అంటున్నరు



ఏడు ఎకరాల్లో పత్తి సాగు చేసిన. పెట్టుబడుల కోసం రూ.4లక్షల వరకు ఖర్చు అయింది. వాతావరణ మార్పులు, వరుస వర్షాల కారణంగా 80 క్వింటాళ్లకు పైగా రావాల్సిన దిగుబడి 60 క్వింటాళ్లకు పడిపోయింది. సీసీఐ సెంటర్‌లో మద్దతు ధరకు అమ్ముకుదామని వెళ్తే క్వాలిటీ లేదని తిరిగి పంపించారు. బతిమిలాడినా వినిపించుకోలేదు. ప్రైవేట్‌కు వెళ్తే రూ.6వేలకు రూపాయి ఎక్కువ ఇవ్వమంటున్నారు. దీంతో ట్రాక్టర్ అద్దె రూ.5వేల వరకు వృథా అయినా.. పత్తిని ఇంటికి తీసుకువచ్చా. ప్రభుత్వం స్పందించి సీసీఐలో మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చూడాలి.

\- కొంగరి పరశురాములు, పత్తి రైతు, కుందారం (లింగాలఘణపురం)

నిబంధనల మేరకే..

సీసీఐ నిబంధనల మేరకే పత్తి కొనుగోలు చేస్తున్నాం. 28 ఎంఎం కంటే తక్కువ ఉన్న పత్తి కొనుగోలు చేయడం లేదు. సీసీఐ సెంటర్‌కు రైతులు తెచ్చే పత్తి క్వాలిటీని అన్ని రకాలుగా పరిశీలించి 8 నుంచి 12 శాతం వరకు ఉన్నదానికే నామ్స్ మేరకు ధర చెల్లిస్తున్నాం.

\- నర్సిరెడ్డి, సీసీఐ ఇన్‌చార్జ్

వినతుల స్వీకరణ.. వివరాలు ఆరా..

ఎస్సీ వర్గీకరణపై సాగిన ఏకసభ్య కమిషన్ విచారణ

- ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక
- కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడి
- మొత్తం 135 వినతిపత్రాలు, దరఖాస్తులు

ఎస్సీ వర్గీకరణ అంశంపై హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయిలో కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ గురువారం బహిరంగ విచారణ చేపట్టారు. ఆయనకు వివిధ కుల, వృత్తి, సామాజిక, ఉద్యోగ సంఘాల నాయకులు, బాధ్యులు తమ డిమాండ్లపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ నిర్వహించి శాస్త్రీయంగా ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందించనున్నట్లు కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ తెలిపారు. - హన్మకొండ

- వివరాలు 8లో▸



జమిడిక వాయిస్తూ సంస్కృతీసంప్రదాయాలు వివరిస్తున్న బైండ్ల సంఘం నాయకులు, కుల వృత్తిదారులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించాం

- ఎన్పీడీసీఎల్ డీఈ రాంబాబు



మాట్లాడుతున్న డీఈ రాంబాబు

స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి టౌన్: విద్యుత్ శాఖ ఘన్‌పూర్ డివిజన్ పరిధిలో వ్యవసాయ రంగానికి సంబంధించిన విద్యుత్ సమస్యలు పరిష్కరించామని ఎన్పీడీసీఎల్ డీఈ రాంబాబు తెలిపారు. ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నెల రోజుల్లోనే డివిజన్ పరిధిలో 280 వ్యవసాయ సర్వీసులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అందులో ఘన్‌పూర్ 36, రాజవరం 64, జఫర్‌గఢ్ 54, శివునిపల్లి 18, పాలకుర్తి టౌన్ 58, పాలకుర్తి రూరల్ 29, కొడకండ్ల 21 ఉన్నాయని చెప్పారు. ఇందులో విద్యుత్ అధికారులు, సిబ్బంది కృషితో పాటు వినియోగదారుల సహకారం ఉందన్నారు. డివిజన్‌లో రూ.18 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నాయని, అవగాహన కల్పిస్తూ వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు.

ప్రాక్టికల్స్‌కు నిధులు విడుదల

జనగామ రూరల్: గతేడాది చిల్పూర్, దేవరుప్పుల కేజీబీవీల్లో నూతనంగా ఇంటర్మీడియట్ విద్య ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ ల్యాబ్ ఏర్పాటు, సైన్స్ ప్రాక్టికల్స్ కోసం సమగ్ర శిక్ష, తెలంగాణ ప్రభుత్వం రూ.50 వేల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు డీఈఓ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు కెమికల్స్, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.25వేల చొప్పున మంజూరయ్యాయన్నారు. అంతేకాకుండా సీసీ కెమరాలకు రూ.6వేలు అందజేస్తున్నట్లు ఇంటర్ విద్యాధికారి జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సోమేశ్వరాలయంలో ట్రెయినీ ఏఎస్పీ పూజలు



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని గురువారం ట్రెయినీ ఐపీఎస్, ఏఎస్పీ మన్నన్ భట్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. ఈఓ మోహన్‌బాబు, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రాత్రి పూట చెత్త సేకరణ



సాక్షి ఎఫెక్ట్..

జనగామ: పట్టణంలో పురపాలిక ఆధ్వర్యాన రాత్రి సమయంలో చెత్త సేకరణకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలోని రహదారులపై విచ్చల విడిగా చెత్త వేస్తుండడంతో అపరిశుభ్రంగా మారిన తీరుపై 'రోడ్లపైనే చెత్తడంపులు' శీర్షికన గురువారం(19న) 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పురపాలిక అధికారులు స్పందించారు. కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి పులి శేఖర్ నేతృత్వంలో నెహ్రూ పార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు వ్యాపార, వాణిజ్య సముదాయాల ఎదుట పేరుకు పోయిన చెత్తను ప్రత్యేక వాహనాల ద్వారా సేకరించారు. రాత్రి సమయంలో దుకాణాలు మూసి వేసిన తర్వాత ఎవరూ చెత్త రోడ్డుపై వేయొద్దని, మరుసటి రోజు షాపుల వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాల్లో మాత్రమే వేయాలని ప్రత్యేక అధికారి సూచించారు.

ధ్యానంతో జ్ఞానం..



దేవరుప్పుల: ఏకాగ్రతతో చేసే ధ్యానం వలన జ్ఞానం లభిస్తుందని రథయాత్ర మాస్టర్ నారాయణ అన్నారు. గురువారం పత్రీజీ ధ్యాన మహాయాగం-3లో భాగంగా చైతన్య జ్యోతి రథయాత్ర మండల కేంద్రానికి చేరుకోగా.. పిరమిడ్ భక్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవుల సంరక్షణతోనే సమాజం సంపూర్ణ ఆరోగ్యం, శాంతి సామరస్యాలతో తులతూగుతుందని చెప్పారు. పిరమిడ్ నిర్వాహకులు చిలుకూరి రమ సత్యనారాయణ, అప్పిడి కళమ్మసోమిరెడ్డి, ప్రవీణ్, ప్రశాంత్, శివ, వీరాస్వామి, భాస్కర్, ఉమఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో(2024-25 విద్యా సంవత్సరం) గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్, పొలిటికల్ సైన్స్‌లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని, అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులతో పాసై ఉండాలని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఈనెల 30వ తేదీ ఉదయం 11.00 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 28వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'వీర్ బాల దివస్'కు కళాకారులు



లింగాలఘణపురం: 'వీర్ బాల దివస్' సందర్భంగా న్యూఢిల్లీలో ఈనెల 26న నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ఒగ్గుడోలు బాల కళాకారులకు ఆహ్వానం అందినట్లు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ జాతీయ పురస్కార గ్రహీత ఒగ్గు రవి తెలిపారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించే 'వీర్ బాల దివస్'కు రాష్ట్రం నుంచి 10 నుంచి 15 ఏళ్లలోపు వయసు కలిగిన 24 మంది కళాకారులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరికి పది రోజులుగా ప్రత్యేక శిక్షణ ఇవ్వగా ఢిల్లీకి బయలుదేరినట్లు చెప్పారు.

సంక్రాంతిలోపు మున్సిపాలిటీ

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: సంక్రాంతి లోపు ఘన్‌పూర్ మున్సిపాలిటీ అవుతుంది.. సీఎంతో మాట్లాడి అభివృద్ధికి రూ.25కోట్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక సీఎస్ఆర్ గార్డెన్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ గ్రామ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 500 మంది కూర్చునేలా మున్సిపాలిటీ టౌన్‌హాల్ నిర్మాణం, అలాగే గ్రామానికి మొదటి విడతలో 250 ఇందిరమ్మ ఇళ్లు, అత్యాధునికంగా లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

ఇందిరతో విభేదాలు లేవు

'సింగపురం ఇందిరతో నాకు ఎలాంటి రాజకీయ విభేదాలు లేవు.. సృష్టించి పనిచేయాల్సిన అవసరమూ లేదు.. కడియం శ్రీహరితో ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.. ప్రజలకు పనిచేయడమే తన లక్ష్యం' అని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఇకపై పార్టీలో పాత, కొత్త అనే తేడాలు ఉండవద్దని, అందరూ కుటుంబసభ్యుల మాదిరిగా నియోజకవర్గ అభివృద్ధికి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, నీల గట్టయ్య, ఘన్‌పూర్ పట్టణ అధ్యక్షుడు నీల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదులకు రూ.178కోట్లు కేటాయించాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పల్లా'

జనగామ: దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసి జనగామ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు రూ.178 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ జనగామతో పాటు యాదాద్రిలోని ఆలేరుకు సాగునీరు అందించాలంటే మరో 499 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి ఏడు నియోజకవర్గాలకు సంబంధించి భూసేకరణ తదితర విషయాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడగ్గా.. లిఖిత పూర్వకంగా అందజేసినట్లు పేర్కొన్నారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ఎక్కువ భాగం జనగామలోనే ఉండడంతో మిగిలి పోయిన ప్యాకేజీ-8, 7, 2లో 3,400 ఎకరాలకు గాను 2,972 ఎకరాలు గతంలోనే ప్రభుత్వం సేకరించిందని, మిగతా భూసేకరణకు రూ.178కోట్లు అవసరమన్నారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని 484 చెరువులను పూర్తిగా నింపాలంటే భూసేకరణ తప్పనిసరి అన్నారు. ధర్మసాగర్ నుంచి గండిరామారం మీదుగా తపాస్‌పల్లి రిజర్వాయర్లను నింపుకుంటే ప్రస్తుత యాసంగి సీజన్‌కు సరిపడా సాగునీరు అందించవచ్చని చెప్పారు. సాగునీటి తరలింపునకు సిస్టం సిద్ధంగా ఉన్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ పరిధిలో 4 మోటార్లను వెంటనే ఆన్‌చేసి చెరువులను నింపాలని విజ్ఞప్తి చేశారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన



అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ : అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి ఆధ్వర్యాన గురువారం ఆర్టీసీ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి, నాయకులు మాట్లాడుతూ.. మతతత్వ బీజేపీ నాయకులు అంబేద్కర్‌ను అవమానిస్తే దేశ ప్రజలు ఊరుకోరని, అహంకారంతో విర్రవీగితే కర్రుకాల్చి వాత పెడతారని అన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాసరెడ్డి, ప్రముఖ డాక్టర్ రాజమౌళి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి మిద్దెపాక సిద్ధులు, మేడ శ్రీనివాస్, సేవాదళ్ రాష్ట్ర నాయకులు సుంకరి శ్రీనివాస్‌రెడ్డి గనిపాక మహేందర్, గంగం నరసింహారెడ్డి, లింగాల నర్సిరెడ్డి, లక్ష్మీనారాయణ, కృష్ణస్వామి, మల్లారెడ్డి, గాదెపాక రామచందర్ పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యాన..

జనగామ రూరల్: అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్, రాష్ట్ర ఈసీ సభ్యుడు నీర్మాల రత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో శ్రీశైలం, మల్లయ్య, అర్జున్, ప్రవీణ్, సిద్ధులు, దండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'తోడు' వీడి.. నింగికేగి

'బలగం' మొగిలయ్య ఇక లేరు

- 'తోడుగా మాతో ఉండి' పాటతో పేరు ప్రఖ్యాతలు
- కొన్నేళ్లుగా తీవ్ర అనారోగ్యం..
- దుగ్గొండిలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- పాటలతో నివాళులర్పించిన కళాకారులు





నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాయకులు

బలగం సినిమా దర్శకుడు యెల్దండి వేణుతో మొగిలయ్య, కొమురమ్మ దంపతులు(ఫైల్)

సాక్షి, వరంగల్/దుగ్గొండి: సంచార జాతినుంచి యక్షగానంతో సినీ తెరకు పరిచయమైన బలగం మొగిలయ్య ఇక లేరు.. ఆయన తంబూర మూగబోయింది.. కిడ్నీలు ఫెయిలై, గుండె సమస్య రావడం, కంటి చూపు కోల్పోయి తీవ్ర అనారోగ్య సమస్యలతో మూడేళ్లుగా బాధపడుతున్న పస్తం మొగిలి అలియాస్ బలగం మొగిలయ్య(67) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం ఆరోగ్యం విషమించింది. ఎంజీఎం ఆస్పత్రికి తరలించేలోపు తుదిశ్వాస విడిచారు. దిల్ రాజు బ్యానర్‌పై దర్శకుడు యెల్దండి వేణు నిర్మించిన బలగం సినిమా చివరి ఘట్టంలో 'తోడుగా మాతోడుండి.. నీడగా మాతో నిలిచి' అనే పాట పాడి కోట్లాది మంది ప్రజల హృదయాలకు దగ్గరైన మొగిలయ్య ఓరుగల్లుకే బలగమయ్యారు. కళాకారులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు.

ఓరుగల్లుకే పేరు తెచ్చారు...



మొగిలయ్య (ఫైల్)

దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలి (67), కొమురమ్మ దంపతులు బేడ బుడిగ జంగాలు. శారదకథ కథలు చెబుతూ జీవనం సాగిస్తున్నారు. వీరి పూర్వీకులది కమలాపూర్ మండలం అంబాల కేశవాపురం. మొగిలి తల్లిదండ్రులు పస్తం పెంటయ్య, ముత్తమ్మ ఉపాధి నిమ్తిం మల్లారెడ్డిపల్లి, సిద్ధాపురం గ్రామాల్లో కొన్నాళ్లు ఉండి 30 ఏళ్ల క్రితం దుగ్గొండికి వచ్చి స్థిరపడ్డారు. మొగిలి భార్యతో కలిసి సుదీర్ఘ కాలం వేలాది కథలు చెప్పి గుర్తింపు పొందారు. ఈ క్రమంలో బలగం సినిమా డైరెక్టర్ యెల్దండి వేణుకు పస్తం మొగిలిని ఒగ్గుకథ కళాకారుడు కాయేతి బాలు పరిచయం చేశారు. అలా బలగం సినిమాలో మొగిలయ్యతో పాడించిన 'తోడుగా మాతో ఉండి... నీడగా మాతో నడిచి' అనే పాట ప్రజల గుండెలను హత్తుకుని కంటతడి పెట్టించింది. ఈ పాటతో మొగిలి, కొమురమ్మ దంపతులకు పేరు ప్రఖ్యాతలు రావడంతోపాటు వరంగల్ జిల్లా పేరు మార్మోగింది. ఇటీవల పొన్నం సత్తయ్య ఫౌండేషన్ అవార్డును మంత్రి పొన్నం ప్రభాకర్ అందించారు. ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఉనికిచర్లలో ఇంటిస్థలాన్ని కేటాయించారు. పట్టా కాగితాలు అందుకునే తరుణంలోనే మొగిలయ్య కన్నుమూశారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం..

మొగిలయ్య మృతి వార్త తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రూ.50వేలు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.50వేలు ఆర్థిక సాయం పంపించారు. వారి ప్రతినిధులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, ఎల్కతుర్తి మండల నాయకుడు బొమ్మెనపల్లి అశోక్‌రెడ్డి.. మొగిలయ్య భార్య కొమురమ్మకు అందించారు. మొగిలయ్య మృతదేహాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి జానపద కళకు తీరని లోటన్నారు. ప్రభుత్వం మొగిలయ్య కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బలగం సినిమా నటుడు రచ్చ రవి, కళాకారులు సంతాపం ప్రకటించారు. సాయంత్రం పలువురు కవులు, కళాకారులు పాటలతో మొగిలయ్యకు నివాళులర్పించారు. అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి.

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలి



పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

జనగామ రూరల్: ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో అసోసియేషన్ ఆధ్వర్యాన ఎర్రోజు రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఒకరికొకరు సహకరించుకుని వాటిని అధిగమించాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలోని 26 మంది పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ తొల్పునూరి రామచంద్రం, జిల్లా కోశాధికారి కొత్తూరి సంపత్ కుమార్, ఉపాధ్యక్షులు గాదె కాథరిన్, జనార్ధన్ రెడ్డి, సరాబ్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్దేశిత సమయంలో పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. గురువారం జనగామ మండలం శామీర్‌పేటలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులను గుర్తించి ఇందిరమ్మ పథకం ద్వారా సొంతింటి కలను నిజం చేసేందుకు ఈ సర్వే చేపట్టిందని చెప్పారు. ఎంపీడీఓ సంపత్‌కుమార్, అధికారులు ఉన్నారు.

జఫర్‌గఢ్‌లో ఆర్డీఓ..

జఫర్‌గఢ్: మండల పరిధి షాపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన విధంగా సర్వే చేపట్టాలన్నారు. గ్రామానికి చెందిన శివరాత్రి వెంకటేష్ ఇంటి స్థలం విషయంలో ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులతో కలసి ఆయన విచారణ చేపట్టారు. తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, ఎస్సై రామ్‌చరణ్, ఆర్‌ఐ అనిల్‌బాబు పాల్గొన్నారు.

32 మందిపై చీటింగ్ కేసు

జనగామ రూరల్: చాకలి ఐలమ్మ మహిళా సమాఖ్య ఆధ్వర్యాన గతంలో వెంకిర్యాలలో రూ.2.35 కోట్లతో 4 ఎకరాల భూమిని మార్కెట్ ధర కంటే అధికంగా చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో అక్రమాలు జరిగాయని నెలరోజుల క్రితం సభ్యులు అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఆర్డీఓ వసంత, పోలీస్‌లు విచారణ చేపట్టారు. బాధ్యులైన ఇద్దరు అధికారులపై వేటు పడింది. రూ.30 లక్షల మేర రికవరీ చేశారు. కాగా గురువారం సమాఖ్య అధ్యక్షురాలు సుధ, కార్యదర్శి స్రవంతి, కోశాధికారి చైతన్య, అకౌంటెంట్ మహేష్, రియల్ వ్యాపారులు కందకట్ల అశోక్, కీర్తి లక్ష్మీనర్సయ్య, వీరేందర్ తోపాటు మరో 25 మందిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఏసీపీ పార్థసారథి తెలిపారు.

క్లుప్తంగా

శ్మశానవాటిక శుభ్రం..



శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

నర్సంపేట: నర్సంపేట పట్టణం వరంగల్ రోడ్డులోని శ్మశానవాటికలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని అంత్యక్రియల సందర్భంగా బుధవారం ఓ బాలికకు గాజు పెంకు గుచ్చుకుని తీవ్రంగా రక్తం చిందింది. ఈ ఘటనపై 'అంత్యక్రియల్లో అపాయం' అనే శీర్షికతో 'సాక్షి' ఎక్స్ క్లూజివ్ కథనాన్ని ప్రచురించింది. దీనికి ఉన్నతాధికారులు స్పందించారు. గురువారం సిబ్బందితో శ్మశానవాటికను శుభ్రం చేయించారు. శవదహన పేటికల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. దీనిపై పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

కాజీపేట జంక్షన్‌కు న్యూ లుక్




నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ త్వరలో అంతర్జాతీయ విమానాశ్రయం మాదిరిలా కొత్త లుక్‌తో కనిపించనుంది. అమృత్ భారత్ స్కీం స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఫుట్ ఓవర్‌బ్రిడ్జి, ఎస్కలేటర్, లిఫ్ట్, ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు వేచి ఉండే గదులు అన్ని విధాలా సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట జంక్షన్ ఎదుట సర్క్యులేటింగ్ ఏరియాను, ఇతర అభివృద్ధి పనులను అత్యాధునికీకరించనున్నారు. కాగా.. గురువారం రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్ అమృత్‌భారత్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతీయువకులకు ములుగు రోడ్డు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్.ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభంకానున్న జాబ్‌మేళాకు అర్హత, ఆసక్తిగల వారు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.పూర్తి వివరాలకు 7093168464 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళలు.. స్వశక్తులు



మైనారిటీలకు ఇందిరా మహిళాశక్తి పథకం

- స్వశక్తితో ఎదిగేలా ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ
- మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో గడువు

న్యూశాయంపేట: మహిళలు ఓ వైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే.. మరోవైపు తమకు ఆసక్తి ఉన్న టైలరింగ్‌పై మక్కువ చూపుతున్నారు. స్వశక్తితో ఎదగడానికి సొంతంగా షాపు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలబడాలని నిరుపేద, మధ్యతరగతి మహిళలు భావిస్తున్నారు. ఇలాంటి మహిళలకు చేయూత నిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. మహిళలు ఆర్థిక స్వావలంబనవైపు అడుగులు వేసేందుకు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం పేరుతో మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు బౌద్ధులు, పార్శిలు) మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేసేందుకు ముందుకొచ్చింది. ఇందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

దరఖాస్తుకు అర్హతలు..

18 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు ఈ పథకానికి అర్హులు. పేద మైనారిటీ మహిళలు, విడాకులు పొందినవారు, వితంతువులు, ఒంటరి మహిళలు , అనాథలకు తొలి ప్రాధాన్యం. ఆధార్ లేదా ఓటర్ ఐడీ కార్డు జతచేయాలి. కనీస విద్యార్హత 5వ తరగతి వరకు చదివి ఉండాలి. తెల్లరేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉండాలి. కార్డులేని వారు సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతల్లోని వారైతే రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతం వారైతే రూ. 2 లక్షల లోపు ఆదాయం కలిగి ఉన్నట్లు తహసీల్దార్‌ధ్రువీకరించిన ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేయాలి. గుర్తింపు పొందిన శిక్షణ సంస్థ నుంచి శిక్షణ పొందినట్లు సర్టిఫికెట్ ఉన్న వారికి పథకంలో ప్రాధాన్యం ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

అర్హత కలిగిన మహిళలు తమ పాస్‌ఫొటోతో డిసెంబర్ 31 తేదీలోగా ఆన్‌లైన్ tgobmms. cgg. gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ ప్రక్రియ అనంతరం హార్డ్‌కాపీలను డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతపరిచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న జిల్లా మైనారిటీ సంక్షేమాభివృద్ధి కార్యాలయాల్లో అందచేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు ఆయా జిల్లాల కార్యాలయాల్లో సంప్రదించాలని మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు సూచించారు.

రూ. లక్ష వరకు ఆర్థిక సాయం అందించాలి



మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌తో పాటు రూ. లక్ష వరకు ఉచితంగా ఆర్థిక సాయం అందించాలి. మహిళలు పూర్తిస్థాయిలో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంది. కుట్టుమిషన్లు అందుకున్న మహిళలకు మగ్గం వర్క్స్, ఎంబ్రాయిడరీ, బ్లౌజ్ డిజైనింగ్ అడ్వాన్స్ టెక్నాలజీ శిక్షణ అందించాలి.

–మహ్మద్ షకీల్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకుడు

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

- డీఆర్ఎం భరతేశ్‌కుమార్



దోర్నకల్: రైల్వే క్వార్టర్లను ప్రారంభిస్తున్న డీఆర్ఎం భరతేశ్‌కుమార్

దోర్నకల్/మహబూబాబాద్ రూరల్ : రైలు ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేశ్‌కుమార్ తెలిపారు. గురువారం డోర్నకల్ జంక్షన్ పరిధిలో నిర్మించిన రైల్వే క్వార్టర్లను ప్రారంభించారు. అలాగే, అమృత్ భారత్ పథకంలో భాగంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వీలైనంత త్వరలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకోవాలని ఆదేశించారు. డీఆర్ఎం మాట్లాడుతూ డోర్నకల్– కొండపల్లి రైలుమార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో రైళ్ల రాకపోకలు ప్రారంభిస్తామన్నారు. మూడో లైన్ అందుబాటులోకి వచ్చే సమయానికి డోర్నకల్‌లో పెద్ద ఎత్తున రైల్వే క్వార్టర్ల నిర్మాణం చేపడుతామన్నారు. కాగా, మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒకటో నెంబర్ ప్లాట్ ఫాంపై నిర్మాణం పూర్తయిన విశ్రాంతి గదులను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏడీఆర్ఎంలు గోపాల్, ఎన్.రమేశ్‌బాబు, డీఈఎన్ డీఎస్ రామారావు, సీనియర్ డీఈఈలు ఎస్వీ ప్రసాదరావు, దినకర ప్రతీణ్, సీనియర్ డీఓఎం సురేశ్, సీనియర్ డీఎస్టీ ప్రియఅగర్వాల్, స్టేషన్ సూపరింటెండెంట్లు శోభన్‌ప్రసాద్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య వివాదం..

- ఎంబీఏ విద్యార్థులను కొట్టిన బీపీఈడీ స్టూడెంట్స్
- ఎంబీఏ విద్యార్థుల ఆందోళన
- చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌కు వినతి
- నలుగురు విద్యార్థులు పదిరోజులు సస్పెన్షన్



రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం చేస్తున్న ఎంబీఏ విద్యార్థులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో బీపీఈడీ, ఎంబీఏ విద్యార్థుల మధ్య వివాదం తలెత్తింది. రిజిస్ట్రార్ మల్లారెడ్డి కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం క్రీడా మైదానంలో ఎంబీఏ విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా పలువురు బీపీఈడీ విద్యార్థులు, ఓ హిస్టరీ విద్యార్థి వచ్చి తాము ఆడుకోవాల్సిన గ్రౌండ్‌లో మీరెలా ఆడుతారని అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. అంతేగాకుండా ఇద్దరు, ముగ్గురు విద్యార్థులను కొట్టారు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన విద్యార్థులను పర్మనెంట్‌గా సస్పెండ్ చేయాలని గురువారం ఎంబీఏ విద్యార్థులు పరిపాలన భవనం వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం ఈ విషయాన్ని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లి వారిని సస్పెండ్ చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఘటనపై కమిటీ వేసి వారిచ్చే నివేదికను బట్టి చర్యలుతీసుకుంటామని హామీ ఇవ్వగా విద్యార్థులు శాంతించారు. కాగా, గురువారం సాయంత్రం ముగ్గురు బీపీఈడీ విద్యార్థులు, ఓ హిస్టరీ విద్యార్థిని క్లాస్‌లు, హాస్టల్ నుంచి పదిరోజులపాటు సస్పెండ్ చేశామని రిజిస్ట్రార్ వెల్లడించారు. క్రీడామైదానంలో ఏ విభాగం విద్యార్థులైనా ఆడుకోవచ్చన్నారు. వివాదం తలెత్తడానికి గల కారణాలు తెలుసుకునేందుకు కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. కమిటీ ఇచ్చే రిపోర్టు అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఎద్దు దాడిలో కార్మికుడి మృతి



సమ్మయ్య (ఫైల్)

మల్హర్ : ఎద్దు దాడిలో ఓ పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎడ్లపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సమ్మయ్య (60) జీపీ మల్టీ వర్కర్‌గా (ఎంపీడబ్ల్యూ) పని చేస్తున్నాడు. పనిలో భాగంగా గురువారం గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా యార్డులో డంప్ చేశాడు. పనులు ముగించుకుని ట్రాక్టర్ దిగి గ్రామ పంచాయతీలోకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఎద్దు.. సమ్మయ్యపై దాడి చేసింది. దీంతో తీవ్ర రక్తస్రావానికి గురై గ్రామ పంచాయతీ ఆవరణలో మృతి చెందాడు.

కస్నా నాయక్, చాందీబాయి @ 75



వధువు మెడలో మాంగళ్యధారణ చేస్తున్న పెళ్లి కుమారుడు

భూపాలపల్లి రూరల్: ఆయన వయస్సు 88, ఆమె వయస్సు 87.. నుదుట పెళ్లి బొట్టు.. తలకు పాగా, పట్టు వస్త్రాలు.. వధువు సిగ్గు పడుతుండగా.. మంగళ వాయిద్యాలు మోగుతుండగా వేదమంత్రోచ్చరణల మధ్య వరుడు.. వధువు మెడలో మాంగళ్యధారణ చేశాడు. వారి వయస్సు ఏమిటీ?.. ఇప్పుడు పెళ్లి ఏమిటనుకుంటున్నారా..అయితే ఈ వార్త పూర్తిగా చదవండి. భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం గ్రామానికి చెందిన నూనవత్ కస్నా నాయక్, చాందీబాయి దంపతులకు పెళ్లయి గురువారానికి 75 వసంతాలు పూర్తయ్యాయి. పెళ్లిరోజు సందర్భంగా కుమారులు, కూతుళ్లు, మనుమలు, మనుమరాళ్లు కలిసి మరోసారి సంప్రదాయ బద్ధంగా ఇద్దరికి పెళ్లి జరిపించారు. పెళ్లికి గ్రామస్తులతో పాటు బంధువులను ఆహ్వానించి విందు భోజనాలు పెట్టారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. మారుమూల గ్రామంలో వ్యవసాయం చేస్తూ ఎన్ని కరువు కాటకాలు వచ్చినా ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివించి వారిని ప్రయోజకులుగా చేసి, ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు, బంధువులు ఆ దంపతులను కొనియాడారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి

హ్యాండ్‌బాల్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా ఈనెల 21న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్స్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

వినతుల స్వీకరణ.. వివరాలు ఆరా..

ఎస్సీ వర్గీకరణపై సాగిన ఏకసభ్య కమిషన్ విచారణ

- శాస్త్రీయంగా డేటా సేకరిస్తున్నాం.. ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక
- రాష్ట్ర షెడ్యూల్ కులాల విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్
- మొత్తం 135 వినతిపత్రాలు, దరఖాస్తులు



విచారణలో మాట్లాడుతున్న ఎస్సీవర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

హన్మకొండ: వినతులు స్వీకరిస్తూ... వివరాలు తెలుసుకుంటూ ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ విచారణ సాగించింది. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఎస్సీ వర్గీకరణపై కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ బహిరంగ విచారణ జరిపారు. వివిధ కుల, వృత్తి, సామాజిక, ఉద్యోగ సంఘాలనుంచి వినతిపత్రాలు అందుకున్నారు. ప్రధానంగా ఉప కులాల ప్రతినిధులు వినతిపత్రాలు అందించినప్పుడు వారి సంస్కృతీసంప్రదాయాలు, వృత్తి, జీవన విధానాన్ని తెలుసుకున్నారు. సంఘాల ప్రతినిధులు చెప్పిన వివరాలు, డిమాండ్లు, కోరికలు, సమస్యలు నోట్ చేసుకున్నారు. మొత్తం 135 వినతిపత్రాలు, దరఖాస్తులు వచ్చాయి. బైండ్ల సంఘం ఆధ్వర్యంలో వారి కులస్తులు జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందించి జమిడిక వాయించి స్తుతి, పంబతో కులవృత్తిని వివరిస్తూ చేసిన ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఏక సభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాల నుంచి వచ్చిన విన్నపాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆయా వర్గాలనుంచి వినతులు, వివరాలు తెలుసుకుంటూనే మరోవైపు శాస్త్రీయ పరిశీలనలో భాగంగా అవసరమైన డేటాను వివిధ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి తెప్పించుకుంటున్నానన్నారు. ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందిస్తామన్నారు. అంతకుముందు ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను వరంగల్ కలెక్టర్, హనుమకొండ ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించి స్వాగతం పలికారు. పలు అంశాలపై చర్చించారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ

- అత్యంత వెనుకబడిన మితఅయ్యల్‌వార్ కులాన్ని ఎస్సీ వర్గీకరణ ఏ గ్రూప్‌లో చేర్చాలని ఆ సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. మా కులాన్ని సైతం ఏ గ్రూప్‌లో చేర్చాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం నాయకులు కోరారు.
- ఎస్సీ వర్గీకరణలో మాదిగల జనాభా దామాషా ప్రకారం 70శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.
- వర్గీకరణలో మోచీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సమగర (మోచీ) కుల సంఘం నాయకులు కోరారు.
- రాజ్యాంగ విరుద్ధమైన షెడ్యూల్ కులాల వర్గీకరణను, సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నామని, ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ మాల మహానాడు నాయకులు వినతి పత్రం అందించారు.
- మా కులాన్ని ఎస్సీ వర్గీకరణలో ఏ గ్రూప్‌లో చేర్చాలని, అభివృద్ధి, సంక్షేమ, రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని, చిందు హక్కుల పోరాట సమితి, చిందు యక్షగాన వృత్తి కళాకారుల సంఘం నాయకులు కోరారు.
- ఎస్సీ జనాభాలో 70 శాతంగా ఉన్న మాదిగలకు 10శాతం, 30 శాతం ఉన్న మాలలకు 4 శాతం, ఉప కులాలకు ఒకశాతం రిజర్వేషన్ అమలు చేయాలని మాదిగ జాగృతి సంఘం నాయకులు విన్నవించారు.
- ఉప కులాల వారికి 8 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బేడ (బుడగ) జంగం ఫెడరేషన్ నాయకులు కోరారు.
- మాదిగ ఉప కులాల సమగ్రాభివృద్ధికి ఎస్సీ వర్గీకరణ చేయాలని షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రతినిధులు కోరారు.
- రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయం సేకరించి 2/3 మెజారిటీతో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేయాలని తెలంగాణ మాల మహానాడు నాయకులు కోరారు.

ఉన్నతస్థాయి ఉద్యోగులు ఉన్నారా?

- సుబ్బయ్యపల్లి గ్రామ సందర్శన



సుబ్బయ్యపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

హసన్‌పర్తి : గ్రామంలో ఎవరైనా ఉన్నతస్థాయి ఉద్యోగం చేస్తున్నారా అని ఎస్సీ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణపై నియమించిన కమిషన్ గురువారం హసన్‌పర్తి మండలం సుబ్బయ్యపల్లి సందర్శించారు. ముందుగా ఆయన స్థానికులతో ముచ్చటించారు. గ్రామం నుంచి డాక్టర్లు, ఇంజనీర్లతోపాటు ఇతర వర్గాలకు చెందిన వారు ఎవరైనా ఉన్నారా అని అడిగారు. గ్రామంలో ఎన్ని కులాలు ఉన్నాయి? ప్రధాన కులం ఏదీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలు అందుతున్నాయా అని అడిగారు. ఈసందర్భంగా ఓ వృద్ధుడు వచ్చి ముగ్గురు కుమారులు, కోడలు అకాల మరణం చెందారని, దీంతో తన పోషణ భారంగా మారిందని కమిషన్ ముందు తమ ఆవేదన వెలిబుచ్చాడు. ఆయనవెంట అధికారులు ఉన్నారు.

అమిత్ షాను మంత్రివర్గంనుంచి తొలగించాలి

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ



కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన చేపట్టారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య శవయాత్ర నిర్వహించి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇక్కడి నుంచి ర్యాలీగా సుబేదారి పీఎస్‌కు చేరుకుని అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అమిత్‌షా రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ప్రపంచ మేధావి అంబేడ్కర్‌ను కించపరిచారన్నారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌కు ఎస్సీ వర్గీకరణ ఆలస్యం కాకుండా చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ అజీజ్, డాక్టర్స్ సెల్ చైర్మన్ శ్రవణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, స్టేట్ యూత్ జనరల్ సెక్రెటరీ శ్వేత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.96,200 విలువైన నూకలు స్వాధీనం

- ఐదుగురిపై కేసు.. ముగ్గురు పరారీ



హసన్‌పర్తి: స్వాధీనం చేసుకున్న నూకలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో గురువారం రూ.96,200 విలువైన నూకలను సీజ్ చేశారు. ఈ ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని ఖరీదు చేసి నూకలుగా మార్చి విక్రయించడానికి తీసుకెళ్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 37 క్వింటాళ్ల నూకలు స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలకు చెందిన గొండ సాయి, గోల్కొండ రాజేశ్, వరంగల్ లేబర్ కాలనీకి చెందిన గుడిపాక అక్షయ్, గోవిందుల గణేశ్, హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన బోళ్ల మమతపై కేసు నమోదు చేశారు. ఇందులో రాజేశ్, గుడిపాక అక్షయ్, గోవిందుల గణేశ్ పరారీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నర్మెటలో ఏడు క్వింటాళ్ల బియ్యం..

నర్మెట: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు. మండలంలోని మల్కపేట గ్రామంలో గురువారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా క్రీడా ప్రాంగణ సమీపంలో బొలెరో వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో తనిఖీ చేయగా ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. కాగా, ఈ ఘటనలో డ్రైవర్ తప్పించుకోగా యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడేనికి చెందిన మాలోత్ ఉమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్..

- వ్యక్తి మృతి.. గోపాల్‌నగర్ వద్ద ఘటన

బచ్చన్నపేట : బైక్‌ను ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలోని గోపాల్‌నగర్ వద్ద జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని నక్కవాని గూడెం గ్రామానికి చెందిన గుంటిపెల్లి యాదగిరి(55) పని నిమిత్తం బైక్‌పై చిన్నరామన్‌చర్ల గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పీఏసీఎస్ భవనం సమీపంలో బచ్చన్నపేటకు చెందిన శివరాత్రి వెంకటేశ్ ట్రాక్టర్ కేజీవీల్స్‌తో ఎదురుగా వస్తూ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలికి ఎస్సై హమీద్ చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వివాహం జరగాల్సిన ఇంట్లో విషాదం..

- ఉరేసుకుని యువతి ఆత్మహత్య
- చిట్యాలలో ఘటన



లావణ్య (ఫైల్)

పెద్దవంగర: వివాహం జరగాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది. ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిట్యాలలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈదురు యాకయ్య, సోమలక్ష్మి దంపతుల మొదటి కూతురు లావణ్య(25) డిగ్రీ పూర్తి చేసింది. ఇటీవల నిశ్చితార్థం జరిగింది. ఇంతలో ఏమైందో తెలియదుగాని గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడింది. తల్లిదండ్రులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది విగతజీవిగా కనిపించింది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.